





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 317 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 07-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




## కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

- 16ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన సీఎం సిద్ధరామయ్య
- దేశంలోనే తొలి రాష్ట్రం..

**న్యూఢిల్లీ**
కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 16ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించింది. ఈ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ.. పెరుగుతున్న మొబైల్ వినియోగం వల్ల పిల్లలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను అరికట్టడమే ఈ నిర్ణయానికి ముఖ్య ఉద్దేశం అని అన్నారు.పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించాలనే అంశంపై కర్ణాటక ప్రభుత్వం గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. సీఎం సిద్ధరామయ్య గత నెలలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్ లర్లతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌కు

-మిగతా 2లో

## మూసీ ప్రక్షాళన
# చేసి తీరుతాం

### అభివృద్ధి చేస్తుంటే గుంపులుగా అడ్డుకుంటున్నారు

- రంగారెడ్డి జిల్లాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతా : సీఎం ఎ.రేవంత్‌రెడ్డి
- శంషాబాద్‌లో అతిపెద్ద రైల్వేస్టేషన్‌కు అనుమతులు
- త్వరలో అక్కడి నుంచే బుల్లెట్ రైలు ప్రయాణం
- మూసీ, రేడియల్ రోడ్డు బాధితులకు అండగా ఉంటాం
- శంషాబాద్‌లో ఏకోపార్క్ ప్రారంభించిన సీఎం
- రేడియల్ రోడ్డు పనులకు శిలాఫలకం

**శంషాబాద్ మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కొందరు గుంపులుగా అడ్డుకుంటున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌సాగర్ వద్ద 85 ఎకరాల విస్తీర్ణంలో రూ.75 కోట్లతో నిర్మించిన ఏకో పార్కు టూరిజం కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే బుద్వేల్ నుంచి నాచారం వరకు రూ.488 కోట్లతో 250 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న నేషనల్ హైవే 167 రేడియల్ రోడ్డు-2 పనులనూ ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన


-మిగతా 2 లో





### సివిల్ సర్వీస్ రాతపరీక్షలో 55వ ర్యాంక్ సాధించిన తెలంగాణ బిడ్డ గుడెల్లి సృజన

**పెద్దపల్లి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు/సెంటనరి కాలనీకి చెందిన పద్మశాలి సింగరేణి ఉద్యోగి కుటుంబం గుడెల్లి రాజేశం--రాణి దంపతుల కుమార్తె గుడెల్లి సృజన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఐఏఎస్‌కి ఎంపికయ్యారు. 2025 ఆగస్టులో నిర్వహించిన సివిల్ సర్వీస్ రాతపరీక్షలో అర్హత సాధించిన ఆమె, 2026 ఫిబ్రవరి 27న జరిగిన పర్సనాలిటీ టెస్ట్‌లో 958 మంది అభ్యర్థులలో మెరిసి, తుది ఎంపిక జాబితాలో 55వ ర్యాంక్ సాధించారు. గతంలో గ్రూప్--1 పరీక్షలో 35వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా నియామకమై, ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.



## ఇండియాపై యుద్ధం ఎఫెక్ట్..

- ఎల్ఎన్‌జీ గ్యాస్ సరఫరాను నిలిపివేసిన ఖతర్
- 40శాతం సప్లయ్ బంద్
- కెనడా, ఆస్ట్రేలియాలతో కేంద్రం చర్చలు

**న్యూఢిల్లీ**
ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గ్యాస్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. యుద్ధం కారణంగా లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) సరఫరా భారీగా తగ్గింది. వాస్తవానికి.. భారత ప్రభుత్వం గ్యాస్ అవసరాలకోసం పూర్తిగా మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడుతుంది. ప్రస్తుతం ఇరాన్- అమెరికా యుద్ధం కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ఇతర దేశాలతో సంప్రదింపులు మొదలు పెట్టింది. ఓవైపు సరఫరాలో కోత పడగా మరోవైపు స్పాట్ మార్కెట్లో కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో ప్రాధాన్యత రంగాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్యాస్ సరఫరా దిగ్గజం గెయిల్ సీఎండీకి సీజీడీ సంస్థల సమాఖ్య ఏసీఈ లేఖ రాసింది. గృహాలు, సీఎన్‌జీ కస్టమర్లు, చిన్న పరిశ్రమలకు

-మిగతా 2 లో

## నేపాల్ ఎన్నికల్లో కొత్త పార్టీ ప్రభంజనం



2

# ఇరాన్ భీకర పోరు

### ఇజ్రాయిల్, అమెరికన్ స్థావరాలపై క్షిపణుల వర్షం

- గల్ఫ్ దేశాల పైనా విరుచుకుపడిన టెహ్రాన్
- లెబనాన్‌లో ఇజ్రాయిల్‌ను అడ్డుకుంటున్న హిజ్బొల్లా
- టెహ్రాన్, బీరుట్‌పై భారీగా ఇజ్రాయిల్ బాంబు దాడులు

**టెహ్రాన్ మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మధ్యప్రాచ్యంలో నివసిస్తున్న ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వరుసగా ఏడో రోజు కూడా భీకర పోరు సాగింది. రక్షణ వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ వైపు నుంచి ఇజ్రాయిల్ పైకి క్షిపణులు దూసుకొచ్చాయి. దీంతో ప్రజలకు మొబైల్ ఫోన్ల ద్వారా అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. అటు గల్ఫ్ దేశాలపైకూడా ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. దుబాయిపై క్షిపణి దాడులు జరిగే అవకాశాలు ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేశారు.

-మిగతా 2 లో



## తెలంగాణ సొమ్ముతో కేరళలో ప్రచారం

- రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెప్పున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ మాయలో ప్రజలు పడొద్దు : మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్**
రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రమైన కేరళలో మాత్రం రూ.వందల కోట్ల తెలంగాణ ప్రజాధనాన్ని మంచి నీళ్లలా పారబోస్తున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ సొమ్ముతో కేరళలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ఆర్భాటాన్ని చేస్తున్నదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేరళ ఎన్నికల కోసం అక్కడి

-మిగతా 2 లో

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

- శాంతి చర్చలు లేవ్..
- షరతులు లేకుండా లొంగిపోవాల్సిందే..



**న్యూఢిల్లీ**
అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రమవుతున్న వేళ అమెరికా ఇరాన్‌కు మరో కీలక హెచ్చరిక జారీ చేసింది. ఎలాంటి షరతులు లేకుండా ఇరాన్ తమ ముందు లొంగిపోవాల్సిందేనని, అంతవరకు ఎలాంటి ఒప్పందం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్ ఇచ్చాడు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ శుక్రవారం ఈ ప్రకటన చేశాడు.

-మిగతా 2 లో

# సివిల్స్‌లో మెరిసిన తెలుగుతేజాలు

- 30 మంది ఎంపిక
- పెద్దపల్లికి చెందిన సృజనకు 55వ ర్యాంకు
- ఫలితాలు విడుదల చేసిన యుపిఎస్‌సి
- అనుజ్ అగ్నిహోత్రికి మొదటి ర్యాంకు

**న్యూఢిల్లీ మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించగా..వారిలో కనీసం 30 మంది తెలుగువారే ఉన్నారు. ఈ ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) శుక్రవారం ప్రకటించింది. రాజస్థాన్‌కు చెందిన ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్ అనుజ్ అగ్నిహోత్రి మొదటి ర్యాంకు సాధించారు. తమిళనాడుకు చెందిన రాజేశ్వరి సువే రెండో ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

-మిగతా 2 లో



## కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

(మొదటి తరువాయి)



సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు కోరారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, నిపుణులు, పిల్లల అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన తాజాగా 16ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధిస్తూ ప్రకటన చేశారు. ఆస్ట్రేలియా గత ఏడాది డిసెంబర్ నెలలో 16ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ చట్టం అమలు చేసింది. ఆస్ట్రేలియా కంటే ముందే.. అమెరికాలోని పలు రాష్ట్రాలు స్థానిక చట్టాల ద్వారా పిల్లలు సోషల్ మీడియా వాడకంపై నియంత్రణ చర్యలు చేపట్టాయి. అయితే, ఆస్ట్రేలియా ప్రభుత్వం స్ఫూర్తితో యూరోపియన్ యూనియన్ ఈ అంశాన్ని పరిశీలిస్తోంది. మరికొన్ని దేశాలు చిన్న పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత దేశం విషయానికి వస్తే.. చిన్నారులు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధించేలా ఆలోచన చేస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆ మేరకు చర్యలు ప్రారంభించామని అన్నారు. అయితే, తాజాగా కర్ణాటక ప్రభుత్వం 16ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచింది.

## ఇండియాపై యుద్ధం ఎఫెక్ట్..

(మొదటి తరువాయి)

నిరాటంకంగా గ్యాస్ సరఫరా చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, కాకపోతే గ్యాస్ లభ్యతపై స్పష్టతనివ్వాలని కోరింది. ప్రస్తుతం ఇండియా రోజుకు 195 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్స్ పర్ డే0 (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్ దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 60 మిలియన్ ఎంఎంఎస్‌సీఎండీ ఖతర్ నుంచి వస్తోంది. ఒక్క ఖతర్ నుండే 40శాతం గ్యాస్ సరఫరా అవుతోంది. ఇరాన్ దాడులు చేయడంతో ఖతర్ ఎనర్జీకి చెందిన ఎల్‌ఎన్‌జీ కేంద్రాల్లో ఉత్పత్తి ఆగిపోయింది. ఈ కంపెనీ ఫోర్స్ మెజర్ నోటీసులు జారీ చేసింది. అంటే ఒప్పందం ప్రకారం.. గ్యాస్ సప్లయ్ చేయలేమని చేతులెత్తేసింది. ఇలాంటి సమయంలో ఇతర దేశాల నుంచి గ్యాస్ కొనడం అనివార్యమైంది. ఖతర్ చేతులెత్తేయడంతో ప్రత్యామ్నాయ వనరులపై భారత దేశం దృష్టి సారించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా దేశాలు భారత్‌కు గ్యాస్ సరఫరా చేయడానికి ముందుకు వచ్చాయి. అలాగే కొత్త ఒప్పందాల ద్వారా యూఏఈ, అమెరికా నుంచి కూడా ఇంధన వనరులు భారత్ సమీకరిస్తోంది. అయితే, ప్రస్తుతం గ్యాస్ కొరత లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ఇరాన్

(మొదటి తరువాయి)

ఒకపక్క ఇరాన్ శాంతి చర్చలకు సిద్ధమంటూ ప్రకటించింది.
ఇతర దేశాల మధ్యవర్తిత్వానికి అంగీకరిస్తామని, అయితే, ముందుగా ఇజ్రాయెల్, అమెరికా నుంచే ఆ స్పందన రావాలని ప్రకటించింది. అంతవరకు తమ దేశ గౌరవం, సార్వభౌమాధికారం కోసం పోరాడుతామని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ కాస్త తగ్గినట్లు అనిపించిన నేపథ్యంలో అమెరికా నుంచి కూడా సానుకూల స్పందన వస్తుందని అంతా అనుకున్నారు. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోమన్నారు. శాంతి చర్చలు ఉండవన్నారు. ఏ షరతులు లేకుండా అమెరికాకు లొంగిపోవాల్సిందే అని ఇరాన్‌కు స్పష్టం చేశాడు. ఇలా చేస్తే ఇరాన్‌లో కొత్త నాయకత్వానికి అంగీకరిస్తామని, ఇరాన్ పునర్నిర్మాణానికి కూడా సహకరిస్తామన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంలాగా మేక్ ఇరాన్ గ్రేట్ ఎగైన్ అంటూ చెప్పారు. అమెరికాతోపాటు తమ మిత్ర దేశాలు కూడా ఈ విషయంలో సహకరిస్తాయని హామీ ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఇరాన్‌తో ఎలాంటి చర్చలు, శాంతి ఒప్పందానికి తాము అంగీకరించబోమని ట్రంప్ వెల్లడించారు. అంతకుముందు ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ అధినేతను తామే నిర్ణయిస్తామన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇదే స్పష్టం చేసింది. తమ అంగీకారం లేని ఇరాన్ అధినేత ఎవరైనా హతమారుస్తామని హెచ్చరించింది. అందుకే ఇరాన్ కూడా తమ కొత్త అధినేతను ఎన్నుకోలేకపోతుంది. ఇటీవల హతమైన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కుమారుడిని ఎన్నుకోవాలని చూసినా, ఈ విషయంలో ఇంకా స్పష్టత లేదు.

## తెలంగాణ సొమ్ముతో కేరళలో ప్రచారం

(మొదటి తరువాయి)

మలయాళ పత్రికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలతో ఇస్తున్న ఫుల్ పేజీ యాడ్స్ చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఒక ఏటీఎంలా మారిందని అర్థమవుతోందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ నమ్మించి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇక్కడ ప్రజల గొంతు కోసి, కేరళలో కలర్ పేజీల్లో యాడ్స్ ఇస్తోందని విమర్శించారు. ఇక్కడ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే తెలివి లేదు గానీ, ప్రకటనల పేరిట తెలంగాణ ప్రజల ధనం కేరళలో వృధా చేస్తారా?అని ప్రశ్నించారు. ఆడబిడ్డల కంట్లో మట్టికొట్టి కేరళ పత్రికల్లో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామంటూ దొంగ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకపోగా విద్యార్థులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడుతున్నారని తెలిపారు. బడుల్లో చదువుకునే పిల్లలకు కనీస వసతులు లేవని పేర్కొన్నారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి కొర్రీలు పెట్టి సగానికి పైగా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసాను రెండు సీజన్లకు ఎగ్గొట్టిందని తెలిపారు. కనీసం యూరియా సరఫరా చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు పెంపును గాలికొదిలేశారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను చెల్లించడం చాతగాని కాంగ్రెస్ ప్రభుత్వం కేరళలో మాత్రం అద్భుత పాలన అంటూ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. అధిష్టానాన్ని మెప్పించడానికి తెలంగాణ ఖజానాను కాంగ్రెస్ అక్షయ పాత్రగా మార్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లు తుడువలేని సీఎం రేవంత్‌రెడ్డి కేరళలో ప్రచారం కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాయలో కేరళ ప్రజలు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇతర రాష్ట్రాల్లో దొంగ ప్రచారాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

(మొదటి తరువాయి)

సమావేశంలో సీఎం మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి చారిత్రక నేపథ్యం ఉందని గుర్తు చేశారు. చార్మినార్, గోల్కొండ, మక్కా మసీద్, ఉస్మానియా ఆస్పత్రి, ఉస్మానియా కాలేజ్‌తోపాటు అనేక అద్భుత నిర్మాణాలు ఉన్నాయన్నారు. హిమాయత్ సాగర్ వద్ద నిర్మించిన ఏకో పార్కు అద్భుతమైనదని తెలిపారు. వినోదం, ఆహ్లాదం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సిన అవసరం లేకుండా.. ఇక్కడే వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి ఈ ప్రాంతాన్ని సందర్శించే విధంగా అద్భుతంగా తీర్చిదిద్దామని అన్నారు. పర్యాటక కేంద్రంగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించి సామాన్యులకు, అన్ని వర్గాలకూ అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల పర్యావరణహితమైన సౌకర్యాలతో ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద నిర్మాణమైనా దాని నిర్వహణ సరిగ్గా లేకపోతే.. త్వరలోనే పాడవుతుందని అన్నారు. నాటి నైజాం వరదల నివారణ కోసం నిర్మించిన గొప్ప చారిత్రాత్మకమైన మూసీ.. నేడు మురికి కుంపగా మారిందని తెలిపారు. గత పాలకులు దాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించి, అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు గుంపులు గుంపులుగా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 40ఏండ్ల పాటు వారి కుటుంబం అధికారంలో ఉండి ఈ ప్రాంతంలో ప్రజల



అభివృద్ధిని అడ్డుకోవడం ఓ మాజీ మంత్రికే చెల్లిందని అన్నారు.

**మూసీ, రేడియల్ రోడ్డు బాధితులను ఆదుకుంటాం**

రంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్‌లో కొంతమంది భూములు కోల్పోతున్నారని, ఆపార్ట్‌మెంట్లు, రేడియల్ రోడ్డు కింద భూములు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని సీఎం హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాల మాదిరి వాళ్ళను రోడ్డుకు వదిలేసే పరిస్థితి లేదని, మెరుగైన నష్టపరిహారం ఇచ్చి భవిష్యత్తులో మరోచోట భూములు కొనుక్కునే విధంగా ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచన మేరకు ఎక్కడైతే భూములు కోల్పోతారో అక్కడే అదే ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు. ఐదేండ్లలో రంగారెడ్డి జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయని స్పష్టం చేశారు. శంషాబాద్‌లో అతిపెద్ద రైల్వే స్టేషన్ నిర్మాణంతో ఇక్కడి నుండే బుల్లెట్ రైలు వెళ్తుందని, దానికి కావాల్సిన అనుమతులు వచ్చాయని తెలిపారు.
బహదూర్‌గూడలో మెట్రో స్టేషన్ ఏర్పాటు జరుగుతుందని, రేడియల్ రోడ్డుతో రంగారెడ్డి జిల్లా వివిధ ప్రాంతాలు పూర్తిగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. శంషాబాద్‌తోపాటు షాబాద్‌లోని చందనవెల్లి పారిశ్రామికవాడ, సీతారాంపూర్ పరిశ్రమ, కావాలాచర్ల పారిశ్రామిక వాడను లింకు చేస్తూ రూ.488కోట్లతో 81 కిలో మీటర్ల రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టామని అన్నారు. మూసీ రివర్ ప్రక్షాళనతో మురుగు ప్రక్షాళన జరగడమే కాకుండా.. 24 గంటల పాటు వ్యాపారాలు, ఉపాధి జరిగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించి, ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ నెల 8 నుంచి 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం 99 రోజులపాటు జరుగుతుందని, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో యుద్ధం.. రోజుకు రూ.8,000 కోట్లు ఖర్చు చేస్తున్న అమెరికా

**న్యూఢిల్లీ**

ఏ రెండు దేశాల మధ్య యుద్ధమైనా.. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఇరువైపులా భారీ నష్టం ఉంటుంది. అందులోనూ యుద్ధం కోసం భారీగా నిధులు ఖర్చు చేయాలి. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి కూడా. ఇప్పుడు ఇదంతా ఎందుకూ అంటే ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధం కోసం అమెరికా భారీగా ఖర్చు పెడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి అధికారిక సమాచారం బయటకు రాదు.కానీ, అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) అనే సంస్థ నివేదిక ప్రకారం అమెరికరా ఈ యుద్ధం కోసం భారీగా ఖర్చు చేస్తోంది. శుక్రవారం నాటికి ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమై వారం రోజులు



అవుతోంది. ఇన్ని రోజులు యుద్ధంపై చేసిన ఖర్చుపై అంచనాల్ని ఈ నివేదిక వెల్లడించింది. యుద్ధం మొదలైన మొదటి 100 గంటల్లోనే అమెరికా 3.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అలాగే ఈ వారం రోజులపాటు సగటున రోజుకు 900 మిలియన్ డాలర్లు ఖర్చైంది. అంటే మన కరెన్సీలో రోజుకు రూ.8,300 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్ల అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు.ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు రక్షణ శాఖకు కేటాయించిన బడ్జెట్‌కు అదనం. అంటే ఈ నిధుల కోసం అమెరికా రక్షణ శాఖ మళ్లీ నిధుల్ని అడగాల్సి ఉంటుంది. దీనికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపాలి. అయితే, ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టొచ్చు. అదనంగా నిధులు కోరితే ప్రతిపక్షం వ్యతిరేకించవచ్చు. కానీ, నిధులు లేకపోతే యుద్ధాన్ని కొనసాగించడం కూడా కష్టమవుతుంది. ఇప్పటికే అమెరికా ప్రజల్లో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, చమురు ధరల పెరుగుదల, జీవన వ్యయం పెరగడం వంటి వాటిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# ఇరాన్ భీకరపోరు

(మొదటి తరువాయి)

టెహ్రాన్‌పై ప్రయోగించిన రెండు డ్రోన్లను ఇరాన్ సైన్యం కూల్చివేసింది. జోర్డాన్‌లోని ఇర్బిత్ నగరంపై ఇరాన్ డ్రోన్ల దాడి చేసింది. వీటిలో అనేక డ్రోన్లను జోర్డాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకొంది. రియాద్‌కు తూర్పు వైపున ఇరాన్ ప్రయోగించిన మూడు డ్రోన్లను కూల్చివేశామని సౌదీ అరేబియా చెప్పింది. కాగా ఇజ్రాయిల్ వాణిజ్య కేంద్రం టెల్ అవీవ్‌లో శుక్రవారం అనేక పేలుడు శబ్దాలు విన్పించాయి. ఇరాన్ తాజాగా ప్రయోగించిన క్షిపణులను కనుగొన్నామని ఇజ్రాయిల్ తెలిపింది. ఇజ్రాయిల్, అమెరికా సేనల దాడిలో ఇరాన్‌లో 3,600కు పైగా నివాస గృహాలు, వాణిజ్య-సేవా కేంద్రాలు, మందుల దుకాణాలు దెబ్బతిన్నాయని రెడ్‌క్రాస్ చెప్పింది. రెడ్ క్రిసెంట్‌కు చెందిన తొమ్మిది భవనాలకు కూడా నష్టం వాటిల్లింది. మరోవైపు హెజ్బొల్లా కూడా దాడులను తీవ్రతరం చేసింది. దక్షిణ లెబనాన్‌లోని ఖియామ్ పట్టణం వైపు వస్తున్న ఇజ్రాయిల్ సైనిక వాహనాలపై దాడి చేసింది. పశ్చిమాసియాలో సైనిక, ఆర్థిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ యుద్ధం ఆర్థిక మార్కెట్లను కుదిపివేసిందని చెప్పింది. కాగా అమెరికా, ఇజ్రాయిల్‌లతో యుద్ధం మొదలైన తర్వాత మొదటిసారిగా ఇరాన్ ప్రజలు పెద్ద ఎత్తున టెహ్రాన్‌లోనూ, దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ శుక్రవారం ప్రార్థనలు జరిపారు. అటు ఇజ్రాయిల్, అమెరికా సేనలు ఇరాన్‌పై దాడులను ఉధృతం చేశాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌పై బాంబుల వర్షాన్ని కురిపించాయి. షిరాజ్ నగరంలోని నివాస ప్రాంతంపై జరిగిన దాడిలో 20 మంది మరణించగా 30 మంది గాయపడ్డారు. సెంట్రల్ టెహ్రాన్‌లో ఇరాన్ సైన్యానికి చెందిన మిలిటరీ అకాడెమీపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి ఇరాన్ ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను నేలకూల్చామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలలోని హెజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ సైన్యం కనీసం 11 వైమానిక దాడులు జరిపింది. కాగా ఇరాన్‌కు చెందిన డ్రోన్ వాహక నౌకపై అమెరికా దాడి చేసినట్లు సమాచారం. తమ సైన్యం తొలి దశ పోరులో శత్రువులను ఆశ్చర్యకరమైన దెబ్బ తీసిందని, తదుపరి దశలో మరిన్ని ఆశ్చర్యకరమైన ఘటనలు జరగబోతున్నాయని ఇజ్రాయిల్ రక్షణ దళాల అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తెలిపారు. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, క్షిపణి లాంచర్లను పెద్ద ఎత్తున నష్టపరిచామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. టెహ్రాన్‌పై దాడులను ఉధృతం చేస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ హెచ్చరించారు. కాగా తన సరిహద్దు ప్రాంతంలోని విమానాశ్రయాన్ని, పాఠశాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరపడంతో ఆ దేశం నుంచి దౌత్య సిబ్బందిని వెనక్కి రప్పిస్తున్నామని అజర్‌బైజాన్ తెలిపింది.

**200 మంది చిన్నారులు బలి**

మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం అనేక మంది చిన్నారుల ప్రాణాలను బలిగొంటోంది. ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క ఇరాన్‌లోనే 181 మంది చనిపోయారు. లెబనాన్‌లో ఏడుగురు, ఇజ్రాయిల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృత్యువాత పడ్డారు.

## నేపాల్ ఎన్నికల్లో కొత్త పార్టీ ప్రభంజనం

### భారీ విజయం దిశగా బాలేంద్ర షా పార్టీ

**ఖాట్మాండు :**



నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడ్డాయి. ఆ దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జెన్-జి మద్దతున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పి) విజయం దిశగా వెళ్తోంది. గురువారం పోలింగ్ ముగియగా.. శుక్రవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాల ప్రకారం.. బాలేంద్ర షా నాయకత్వంలోని ఆర్ఎస్పీ మెజార్టీ స్థానాల్లో విజయం వైపు దూసుకెళ్తోంది. ఆ పార్టీ మొత్తం 110 స్థానాల్లో ముందంజలో ఉంది. నేపాలీ కాంగ్రెస్, ఇతర పార్టీలు ప్రభావాన్ని చూపట్టలేకపోయాయి. కాంగ్రెస్ ఒక స్థానంలో గెలిచి, 10 చోట్ల ఆధిక్యంలో ఉంది. కమ్యూనిస్టు అభ్యర్థులు ఏడు చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. నేపాల్‌లో మొత్తం 165 స్థానాలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 67 పార్టీలు పోటీచేశాయి. గతేడాది జెన్-జి ఆందోళనలతో కెపి శర్మ ఓలీ నాయకత్వంలోని నేపాల్ ప్రభుత్వం కూలిపోయిన విషయం విదితమే. దీంతో అక్కడ ఎన్నికలు అనివార్యమయ్యాయి. నేపాల్‌లో 275 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో 165 మంది సభ్యులు ఎఫ్‌పిటిపి వ్యవస్థ ద్వారా ఎన్నికవుతారు. 110 సీట్లు దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారా భర్తీ అవుతాయి. ఈ నెల 9 నాటికి ఎన్నికల కౌంటింగ్ పూర్తవుతుందని ఆ దేశ ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

## సివిల్స్‌లో మెరిసిన తెలుగుతేజాలు

(మొదటి తరువాయి)

3వ ర్యాంక్‌లో హర్యానాకు చెందిన అకాన్ష్ ధూల్ నిలిచారు. ఫలితాలను యుపిఎస్‌సి.జిఓవి.ఐఎన్‌లో చూడవచ్చనని తెలిపింది. సమాచారం కోసం పనివేళల్లో 23385271, 23381125, 23098543 నంబర్లకు ఫోన్ చేయవచ్చునని తెలిపింది. కాగా, శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 30 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. వీరిలో తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన గుడెల్లి సృజన 55వ ర్యాంక్ సాధించారు. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీగిరిరాజు విపిఎస్ సాయి కృష్ణ (125), కొలిపాక శ్రీకృష్ణ సాయి (150), బనోతు లక్ష్మి రచన (178), ఎస్ వర్షిత్ రెడ్డి (259), వెలిమినేటి విక్రమ్ సింహ రెడ్డి (541) ఉన్నారు.
హైదరాబాద్‌లోని వివిధ కోచింట్ సెంటర్ల సమాచారం ప్రకారం..తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 74,427 మంది దరఖాస్తు చేసుకోగా..వారిలో 42804 మంది పరీక్ష రాశారు. వీరిలో 90 మంది ఇంటర్వ్యూ వరకు వెళ్లగా..తుది ఫలితాల్లో ఎంపిక జాబితాలో కనీసం 30 మంది చోటు దక్కించుకున్నారు. గతేడాది 54 మంది సివిల్స్‌లో సత్తా చాటారు.

# 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన స్థానిక నాయకులకు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. మార్చి 6 నుంచి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించబడతాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తామని, తిరస్కరించిన ఫైల్స్‌కు స్పష్టమైన కారణం తెలియజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. 99 రోజుల కార్యక్రమం చివరి వరకు ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ ముస్కాన్ నాజ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓబీసీల్లో 40 కులాలను చేర్చాలని జేఏసీ డిమాండ్




**పెద్దపల్లి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన బీసీ కులాలను కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ జాబితాలో చేర్చేలా పార్లమెంటులో అంశాన్ని ప్రస్తావించి ఒత్తిడి తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో 130 కులాలను రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించిందని, అయితే అందులో 90 కులాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన 40 కులాలు ఓబీసీ జాబితాలో లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొన్నదని, రాబోయే జనగణనలో బీసీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో ఈ 40 కులాలు ఓబీసీలుగా నమోదు కాకపోతే, కేంద్రం నుంచి బీసీలకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు, పథకాలు అందకపోవడంతో పాటు రిజర్వేషన్లపై కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎంపీకి వివరించారు. ఈ నెల 16నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై గళమెత్తి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా ప్రయత్నించాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించి, పార్లమెంటులో ఈ అంశాలను లేవనెత్తి బీసీలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని తెలిపినట్లు కొండి సతీష్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ఆత్మీయ సమ్మేళనం




**జగిత్యాల, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఆత్మీయ అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి పాల్గొన్నారు. వారితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి కూడా హాజరై కార్పొరేటర్లు, కౌన్సిలర్లను అభినందించారు.

# అదనపు కలెక్టర్ కుటుంబ వేడుకలో జిల్లా ప్రముఖుల సందడి



**పెద్దపల్లి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గతంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందిన, ప్రస్తుతం గద్వాల జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న మంతెన లక్ష్మీనారాయణ--శ్రీదేవి దంపతుల ప్రథమ పుత్రుడు అభినవ్--డాక్టర్ ప్రణవి వివాహ మహోత్సవం గురువారం హైదరాబాద్‌లోని ఎస్‌పి ఆర్ శ్రీరస్తు కన్వెన్షన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పెద్దపల్లి జిల్లా నుండి ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు, అఖిల భారత మహాసభ రాష్ట్ర నాయకుడు కౌలె జగన్నాధం, బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ కుందరం గణేష్ చారి, జిల్లా యూత్ అధ్యక్షుడు గర్రెపల్లి క్రాంతి కుమార్, అనంతోజు బ్రహ్మచారి, మాతృ సంఘం రాష్ట్ర నాయకులు లాల్కోట వెంకటాచారి, మదన్ మోహన్, మారోజు సుదర్శన్ చారి, వడకాపురం మురళి తదితరులు వధూవరులను ఆశీర్వదించి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లక్ష్మీనారాయణ పెద్దపల్లిలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేవారని, విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని గుర్తు చేసుకున్నారు. అధికారిక బాధ్యతలతో పాటు సామాజిక వర్గాలతో ఆయన కొనసాగించిన ఆత్మీయ అనుబంధం కారణంగానే తామంతా ఈ వేడుకకు హాజరయ్యామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత కలెక్టర్లు ముద్దసాని పురుషోత్తం రెడ్డి, సంకిడి ప్రభాకర్ రెడ్డి, వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, లక్ష్మీనారాయణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వివాహ వేదిక వద్ద కోలాహలం నెలకొంది.

# మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి కార్యాచరణ



**పెద్దపల్లి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మార్చి 6 నుండి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు సూచించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యం బాగుంటేనే గ్రామ ఆరోగ్యం బాగుంటుందని, కల్తీ ఆహారం వాడకం వల్ల క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతోందని హెచ్చరించారు. నూనె వాడకం తగ్గించాలని, లేకపోతే గుండె సంబంధిత వ్యాధులకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్య తీవ్రం అయ్యే వరకు వేచి చూడకుండా, మొదటి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో త్వరగా ఆరోగ్యవంతులం కావచ్చని అన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, షుగర్ వల్ల అనేక రోగాలు వస్తాయని, దీనిని మంచి ఆహారపు అలవాట్లతో నియంత్రించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆధునాతన వైద్య సేవలతో అందుబాటులో ఉందని, ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజలకు క్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, నవజాత శిశువులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారుతున్నాయని, గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ, జిల్లా వైద్యాధికారి, పలు గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పచ్చని నగరంలో చిచ్చు పెట్టవద్దు

## కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక




**గంగాధర, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు చొప్పదండిలో చిచ్చు పెట్టడానికి వస్తున్నారని, కేటీఆర్, హరీష్ రావు రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిల్లర రాజకీయాలు చేయడంలో నంబర్ వన్ అని, ఆయనను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో చొప్పదండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కెసిఆర్, హరీష్ రావు నియోజకవర్గాల్లోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల కోసం చొప్పదండి రైతులను బలి చేశారని, వారి భూములను లాక్కొని మోసం చేశారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ చొప్పదండి నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడ కేటాయించలేదని ఎద్దేవా చేశారు. హరీష్ రావు చొప్పదండికి వచ్చి ఏం ఒరగబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. వరద కాలువ ఓటీలు, నారాయణపూర్ రిజర్వాయర్, ఎడమ కాలువ పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు నిధులు కేటాయించినా, చొప్పదండికి కనీసం 10 శాతం కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చొప్పదండిలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, ఓటీల నిర్మాణాన్ని ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్న ఘనత మేడిపల్లి సత్యం దక్కుతుందని తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.23.50 కోట్లు మంజూరు చేయించారని, త్వరలో మరో రూ.20 కోట్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పురుమల్ల మనోహర్, జవ్వాజి హరీష్, వన్నెల రమణారెడ్డి, చిలువేరి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు పోత్తూరి మహేష్, బొమ్మరివేని తిరుపతి, బోయిని ఎల్లేష్, బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, నిజాపురం చందు, గంగాధర సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ముద్దం నగేష్, మునిగల రాజేందర్, సువిన్ యాదవ్, మ్యాక వినోద్, వంగల శ్రీనివాస్, మనిష్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్‌లో ప్రజా పాలన సన్నాహక సమావేశం





**సిద్దిపేట, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఉమ్మడి మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలవాలని, ప్రజలతో మమేకమై వారితో కలిసి పనిచేయడం ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వేసవికాలంలో త్రాగునీరు సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో బోర్ల రిపేర్లు, ప్రత్యామ్నాయ తాగునీరు సరఫరా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా అన్ని శాఖలు పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహించాలని, ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించాలని, విద్యా--వైద్య రంగాల్లో పేదలకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామని తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయి, ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు రైతులను ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లి అవగాహన కల్పించామని, గ్రామ సభల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించి వారి అనుభవాలను పంచుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీలు మాధవనేని రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, సంజీవ రెడ్డి, ఎంఎల్సీ అంజిరెడ్డి, టిజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించి, ఆసుపత్రిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసి వాటిని డాక్యుమెంట్ చేయాలని, 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో రోజువారీ కార్యక్రమాల వివరాలు ప్రజలకు తెలిసేలా బయట బ్యానర్ ఏర్పాటు చేయాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, సిబ్బంది సమయపాలనను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన

**--ప్రగతి ప్రణాళిక సదస్సు**




**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అంశంపై 15 రోజుల సదస్సు ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సంస్థాగత నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పరిపాలన సామర్థ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు దగ్గర చేయడం, సేవా పంపిణీ వ్యవస్థలను మెరుగుపరచడం, సమయపరిమితితో కూడిన సంస్థాగత బలోపేతం సాధించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం కావడానికి తమ వంతు కృషి చేయాలని సంకల్పించారు.

# మెడికల్ కాలేజీ విద్యార్థులకు బస్సు సౌకర్యం



**మంచిర్యాల, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముందుకొచ్చారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.80 లక్షలు మంజూరు చేసి మూడు బస్సులను విద్యార్థుల వినియోగానికి అందజేశారు.గతంలో కాలేజీని సందర్శించిన సమయంలో విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన వంశీకృష్ణ, నిధులు కేటాయించి బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచిర్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్య మన హక్కు... విద్యతోనే మన భవిష్యత్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు, మెడికల్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందూరు సభలో కాంగ్రెస్పై ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు




**నిజామాబాద్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో మల్కాజ్గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ అరవింద్ ధర్మపురితో కలిసి గెలిచిన వారిని సన్మానించారు.ఈటల రాజేందర్ మాట్లాడుతూ, అరవింద్ తండ్రి డి. శ్రీనివాసను తాను ఎంతో గౌరవించేవాడినని, ఆయన తెలంగాణ ఉద్యమంలో ధర్మరాజు లాంటి పాత్ర పోషించి రాష్ట్ర ఏర్పాటుకు కీలకంగా నిలిచారని గుర్తు చేశారు. రాజకీయాల్లో సీనియారిటీ అనేది పార్టీలో ఉన్న కాలం ఆధారంగా కాకుండా ప్రజాస్వామ్యంలో చేసిన సేవల ఆధారంగా నిర్ణయించబడుతుందని అన్నారు. ప్రజలే అంతిమ బాసులని, ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు ఎప్పుడూ తొలి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.ఇందూరులో ఈసారి బీజేపీ అత్యధిక విజయాలు సాధించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో డబ్బుల ప్రభావం పెరిగిందని, దీనిని తగ్గించాలంటే బీజేపీని మరింత బలంగా చేయాలని, కార్యకర్తలు కమిట్మెంట్‌తో పనిచేస్తేనే గెలుపు సాధ్యమవుతుందని అన్నారు. రాజకీయాల్లో బీజేపీకి సిద్ధాంతం ఉందని, ఇది జంగమయ్యల పార్టీ కాదని, యాచించే స్థాయి నుండి శాసించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలం బీజేపీదేనని, నరేంద్ర మోడీని దేశ ప్రజలంతా అభిమానిస్తున్నారని, ఆయనకు కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అరుదైన గౌరవం దక్కిందని అన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను నిరాశపరిచిందని, నిరుద్యోగ భృతి, కొత్త పెన్షన్లు, కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, రేవంత్ రెడ్డి జేజెమ్మ దిగి వచ్చినా మళ్లీ గెలవలేరని వ్యాఖ్యానించారు.ఈటల రాజేందర్ తెలంగాణలో హుందాగా ఉండే నాయకుడని, ఆయనతో కలిసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని తాను, ఎంపీ అరవింద్ సంకల్పించామని అరవింద్ తెలిపారు.

# చిట్టి బుర్రలకు పదును

**- ఇన్‌స్పైర్ పోటీల్లో కమ్మదనం గురుకుల అమ్మాయిల విజయకేతనం**



**ఫరూఖ్‌నగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న "ఇన్‌స్పైర్ మనక్" పోటీల్లో కమ్మదనం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల సైన్స్‌దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 8వ తరగతి చదువుతున్న పి.శాలిని, ఓ.సహస్ర తమ వినూత్న ఆవిష్కరణ ఆలోచనలతో ఎంపికయ్యారు.ఈ అవార్డు కింద ఒక్కో విద్యార్థికి ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం రూ.10,000 ప్రైజ్ మనీ మంజూరు చేయబడింది. ఫరూఖ్‌నగర్ మండలం నుంచి మొత్తం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా, అందులో ఇద్దరు అమ్మాయిలు కమ్మదనం గురుకుల పాఠశాలకు చెందినవారు కావడం విశేషం.ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ, "ఇన్‌స్పైర్ మనక్ అవార్డు 2025--26కు మా గురుకుల విద్యార్థినులు ఎంపిక కావడం గర్వకారణం. వారి ప్రతిభను అభినందిస్తూ, మార్గదర్శకత్వం అందించిన ఉపాధ్యాయులను కూడా అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలతో ముందుకు సాగి విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# శ్రమదానం చేసిన అధికారులు



**ఆమనగల్లు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులు శ్రమదానం చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.అంతకుముందు వారు సమావేశమై ప్రగతి ప్రణాళికపై చర్చించి ప్రజాపాలన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సేవలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో మాధవరెడ్డి, ఏపీఎం నీరజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ఆమనగల్లు పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్




**ఆమనగల్లు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు ఆమనగల్లు పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్ స్క్రీనింగ్, మాత--శిశు ఆరోగ్య సేవలు, దంత, కంటి, ఎముకలకు సంబంధించిన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.ఉచిత మందుల పంపిణీతో పాటు ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించనున్నారు.

# ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక ప్రారంభించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



**మిర్యాలగూడ, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతవత్ శంకర్ నాయక్, శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలు, వైస్‌చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, "ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రభుత్వం ఆదేశించిన ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి" అని కౌన్సిలర్లకు సూచించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి హాజరైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్‌నగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పురపాలకానికి ప్రగతి వెలుగులు పంచాలన్న ఉద్దేశంతో భిన్న రూపాలలో వివిధ కార్యక్రమాలను రూపొందిస్తూ 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రజాపాలన ప్రణాళికను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, సిడిఎంఏ డైరెక్టర్ మమత, మున్సిపల్ వైస్‌చైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పురపాలక కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్లు అగ్గనూర్ విశాల, శ్రావణి, లక్ష్మీ ప్రసన్న, శివగోపాల్, మురళీమోహన్ (అప్పి), పెంటయ్య, దిలీప్, వాణి, శిరీష, రిజవాన బేగం, అశోక్, మరియబేగం, జయాలక్ష్మి, నాజియా బేగం, సంతోషి బాయి, అరిఫ్ బేగం, తెలుగు వసంత, అనిత, శారద, జ్రుమద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచి నీటి సరఫరా పై అధికారులకు సూచనలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవికాలంలో తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలని ఆయన సూచించారు. మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు జరిగితే వెంటనే స్పందించి అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలానికి ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదిక అందించాలని ఆయన కోరారు. అమృత్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న ట్యాంకుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, మిగిలిన పైప్‌లైన్ కనెక్షన్లు, ట్యాప్ కనెక్షన్లు కూడా త్వరగా ఇవ్వాలని సూచించారు. షాద్‌నగర్ పట్టణంలో పైప్‌లైన్ తవ్వకాలు, కేబుల్ లైన్ పనులు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో, అనుమతులతో జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కవిత, రోడ్డు--భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సందీప్, అబ్దుల్ బారి, అన్ని మండలాల మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ డి.ఇ. నరేష్, పబ్లిక్ హెల్త్ డి.ఇ. సాజిద్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

**-- ఏఐఎస్ఎఫ్**



**ఫరూఖ్‌నగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చకుండా, నిబంధనలు అతిక్రమించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ, "మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పాఠశాల ప్రాంగణాల్లోనే పుస్తకాలు, యూనిఫార్ములు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా వేధిస్తున్నాయి. ప్రభుత్వం వీటిని నిషేధించినా, తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయి" అని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫార్ముల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని, అనుమతి లేకుండా పెంచిన ఫీజులను నియంత్రించాలని, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం కావాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నల్లగొండ లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. పేదవారికి నిపుణులైన వైద్యులచే ప్రత్యేక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చి 6 నుండి 31 వరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒకరోజు ఆరు రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డెంటల్, ఓబీజీ, ఆర్థో, ఆప్తమాలజీ, పీడియాట్రిషన్ వైద్యులచే పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందులు, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. రోగులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రత్యేక ఐడి నంబర్ పొందడం ద్వారా భవిష్యత్తులో కూడా వైద్య సేవలు పొందగలరని చెప్పారు. స్పెషలిస్ట్ వైద్యులు ప్రతిరోజు రెండు--మూడు పీహెచ్‌సీలను కవర్ చేస్తూ అన్ని కేంద్రాల్లో సేవలు అందించనున్నారని తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫైళ్ల పరిష్కారం కూడా చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సమన్వయం, సహకారంతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లైన్‌వాడ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆప్తమాలజీ, ఆర్థో, డెంటల్, ఇతర కౌంటర్లను పరిశీలించి రోగులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను విని పరిష్కారం కోసం వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, లైన్‌వాడ యూపీహెచ్‌సీ డాక్టర్ ఇఫ్తేయార్, కార్పొరేటర్ మహమ్మద్ ఖాజా సమయుద్దిన్ నదీమ్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులపై అవగాహన




**కడ్తాల్, మార్చి 6 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
యువత వాతావరణ మార్పులపై అవగాహన కలిగి ఉండాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు కోర్పోలు లక్ష్మారెడ్డి అన్నారు. కాచిగూడ డిగ్రీ కళాశాల హైదరాబాద్ నుండి సుమారు 104 మంది విద్యార్థులు 4 అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ది ఎర్త్ సెంటర్ కడ్తాల్ మండలం అనుమాస్ పల్లి లో వన్ డే ఎన్విరాన్మెంటల్ ఓరెంటేషన్ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా మదర్ ట్రీ పూజ కార్యక్రమం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అంతరించి పోతున్న పర్యావరణ పరిరక్షణకు కళాశాల స్థాయి నుండి విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారు పూర్వం భద్రకా కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివానని గుర్తు చేసుకున్నారు. ఔషధ మొక్కల లాభాలు మరియు ఉపయోగాలు, విత్తన బంతుల తయారీ వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ తులసీరావ్, డాక్టర్ నారాయణ రావు, వందేమాతరం మాధవరెడ్డి ముఖ్య అతిథులుగా మరియు బద్రుక డిగ్రీ కళాశాల ప్రొఫెసర్స్ డాక్టర్ నవీన్ కుమార్ డాక్టర్ సుష్మాదేవి, డాక్టర్ శృతి, మహేందర్. సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు నాగేష్, రజనీకాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సమావేశం



**కడ్తాల్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామపంచాయతీ వంపుగూడ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కడ్తాల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్, చల్లంపల్లి మొదటి వార్డు సభ్యురాలు పోతుగంటి రాణి హాజరయ్యారు. కమిటీలో బాలింతలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై చర్చించి, అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ మాట్లాడుతూ, "గర్భిణీ స్త్రీలు ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే పోషకాహారం తీసుకోవాలి. బచ్చలకూర, పాలు, గుడ్లు, పెరుగు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యానికి అవసరమైన పోషణ లభించి, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదం చేస్తుంది" అని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చల్ల ప్రమీల కిరణ్, ఆశా వర్కర్ మల్లీశ్వరి, బాలింతలు, గర్భిణీ స్త్రీలు ప్రీతి, అనూష, పి. మౌనిక, అంజలి, రాణి, శిరీష, పుషమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రారంభం

**కడ్తాల్, మార్చి 6,( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
కడ్తాల్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అన్ని గ్రామాలలో పాఠశాలలు, గ్రామపంచాయతీలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశు భ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉప సర్పంచ్లులు, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# నేతాజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం






**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సి.ఓ.ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశాన్ని ప్రేమించండి, సమాజానికి సేవ చేయండి" అనే నేతాజీ సందేశం నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. "మీరు నాకు రక్తం ఇస్తే నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అంటూ యువతను ఉద్యమంలోకి తీసుకొచ్చిన నేతాజీ ధైర్యసాహసాలు, త్యాగం, దేశభక్తి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిన నేతాజీ ఆశయాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని, దేశ అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. మిత్ర ఫౌండేషన్ కల్వకుర్తి పట్టణంలో 100 సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో నిలుస్తూ నేతాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు ఇలాగే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ ఫౌండర్ కుడుముల చంద్రకాంత్ రెడ్డి, అధ్యక్షుడు కుకుడాల శ్రీకాంత్ నేత, సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కి మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక


గుండాల ఇందు శ్రీ


మోతే చైతన్య

**నల్లగొండ, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేద కుటుంబాల నుంచి వచ్చి తెలంగాణ మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయస్థాయి ఉపకారవేతనాలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పేరిట ఉపకారవేతనాలు అందిస్తోంది. తిప్పర్తి మోడల్ స్కూల్‌కు చెందిన గుండాల ఇందు శ్రీ, మోతే చైతన్య ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు నాలుగేళ్ల పాటు ఒక్కో విద్యార్థికి రూ. 12,500 చొప్పున ఉపకారవేతనం వారి ఖాతాల్లో జమ కానుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. అపర్ణ మాట్లాడుతూ, "పేద కుటుంబాల నుంచి వచ్చినా మా విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని నిరూపించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి" అని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

**శివ పార్వతుల కళ్యాణం విజయవంతం చేసిన ప్రత్యేక ధన్యవాదాలు**





**దేవరకొండ మార్చి 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్).** ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్ట పైన నిర్వాహకులు అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆమె అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని అన్నారు. ఈ గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శివుడు, భవానీల కూడిన ప్రసిద్ధ శైవ క్షేత్రం అన్నారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం విజయవంతం చేసిన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, గ్రామ పాలక వర్గం, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో


రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో గంగయ్య.

**ఎలిగేడు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య శుక్రవారం ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, వాటిని సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వివిధ భూసమస్యలపై కార్యాలయానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, డిప్యూటీ తహసీల్దార్ అనిల్, ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు పకడ్బందీగా జరగాలి

**-- డీఎల్పీవో దేవకీదేవి**


బురణ్ మియాపేట్ గ్రామపంచాయతీలో సూచనలు సలహాలు ఇస్తున్న డి ఎల్ పి ఓ దేవకీదేవి.

**ఎలిగేడు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్పీవో దేవకీదేవి సూచించారు. శుక్రవారం ఆమె ఎలిగేడు మండలం బుర్హాన్మియాపేట గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న శుభ్రత పనులను పరిశీలించి, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ పన్నులు వసూలు 100 శాతం పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపు రజిత, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలిగేడులో గ్రామసభలో రసాభాసా


ఎలిగేడులో గ్రామ సభలో ఉప సర్పంచ్ ముంజం నరేష్ వార్డు సభ్యులు గ్రామస్తులు

**ఎలిగేడు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్ అధ్యక్షతన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు గత పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో స్వాగత కమాన్ బోర్డు నిర్మించినట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులను స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపించారు. సాక్షరభారత్ కార్యక్రమానికి గత ప్రభుత్వం ఇచ్చిన సామాగ్రి ఎక్కడ ఉందని పలువురు వార్డు సభ్యులు నిలదీశారు. గ్రామ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు, దుకాణ సముదాయాల కిరాయిలు, ఇతర ఆదాయాలు ఎస్‌టిఓ రిజిస్టర్లో ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. తరువాత గ్రామాభివృద్ధి పనులపై తీర్మాణాలు చేశారు. గ్రంథాలయం పునరుద్ధరణ, ఓపెన్ జిమ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్స్, మంచినీటి పైప్‌లైన్లు, హ్యాండ్‌పంపుల మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముంజం నరేష్, కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## యువత స్వయం కృషితో అన్ని రంగాల్లో ఎదగాలి

**మక్తమాదారంలో కిరాణా జనరల్ స్టోర్ ను ప్రారంభించిన డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**కడ్తాల్, మార్చి 06 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )** చదువుకున్న యువతీ యువకులు స్వయంకృషితో అన్ని రంగాలలో ఎదగాలని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ మండలంలోని మక్త మాదారం గ్రామంలో ఓ యువకుడు ఏర్పాటు చేసుకున్న కిరాణా జనరల్ స్టోర్ ను డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయంకృషితో ఎదగడం ఎంతో గొప్ప విషయమని అలా స్వయంకృషితో ఎదగాలని దృఢ నిశ్చయంతో రమ్య నరసింహ ఏర్పాటు చేసుకున్న కిరాణా జనరల్ స్టోర్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వ్యాపారంలో ఉన్న మెలుకువలు పాటించి నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రమ్య నరసింహ దంపతులను గంప వెంకటేష్ గుప్తా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, నాయకులు చంద్రమౌళి, వార్డు సభ్యులు యాదగిరి, శ్రీకాంత్, గ్రామ యువకులు జంగయ్య, యాదగిరి, చందు, కిషన్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్



**వెల్దండ, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని నాలుగో నెంబర్ రేషన్ షాప్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వంటకు కావలసిన వస్తువుల విషయంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సైజు తక్కువగా ఉన్న గుడ్లను ఎందుకు రిటర్న్ చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా మండల పరిధిలోని గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలను, వెల్దండలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. రెండో వార్డులోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డిఓ, వెల్దండ మండల ఎమ్మార్వో కార్తీక్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంఈఓ చంద్రుడు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలు చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్





**వెల్దండ, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని నాలుగో నెంబర్ రేషన్ షాప్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వంటకు కావలసిన వస్తువుల విషయంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సైజు తక్కువగా ఉన్న గుడ్లను ఎందుకు రిటర్న్ చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా మండల పరిధిలోని గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలను, వెల్దండలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. రెండో వార్డులోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ, వెల్దండ మండల ఎమ్మార్వో కార్తీక్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంఈఓ చంద్రుడు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెంథ తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతుల ఆవేదన




**హుస్నాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలో మెంథ తుఫాన్ ప్రభావం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వర్షాలకు దెబ్బతిని నేలకొరిగాయి. నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని స్థానిక నాయకులు విమర్శించారు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం, హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు 4000 మంది రైతులు నష్టపోయినట్లు అంచనా వేసింది. తుఫాన్ తర్వాత కేంద్రం, రాష్ట్రం ఎకరానికి రూ.10,000 పరిహారం ఇస్తామని ప్రకటించినా, ఇప్పటివరకు ఆ నిధులు రైతులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు సాయం కూడా మార్చి నెలలో అందకపోవడం రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ పరిస్థితుల్లో బాధిత రైతులను ఆదుకోవాలని, లేకపోతే బీఎస్పీ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో విక్రం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం



**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన నివాస స్థలాలపై ఉన్న ఆంక్షలను తొలగించి, వారికి నిర్మాణ అనుమతులు ఇవ్వాలని మంత్రులకు వినతిపత్రం అందజేశారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ




**మానకొండూర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా పరిషత్ పాఠశాల బొమ్మకల్, జ్యోతిరావు పూలే భూపతిపూర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అలుగునూర్, కేజీబీవీ గర్రెపెల్లి, జిల్లా పరిషత్ పాఠశాల గర్రెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. సోల్జర్ కి గన్ను -- స్టూడెంట్ కి పెన్ను అనే స్ఫూర్తిదాయక నినాదంతో తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సరస్వతీ కటాక్షం పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1150 పెన్నులు విద్యార్థులకు అందజేశారు. చిలుకూరి బాలాజీ సుందరేశ్వర శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహారాజ్ సత్సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పెన్నులు అందజేసి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఇజ్జగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు



**కరీంనగర్ రూరల్ , మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 6వ డివిజన్ బొమ్మకల్‌లో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై, పారిశుధ్య కార్మికులతో ప్రమాణం చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దొంతినేని జ్యోతి, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు గాలిపెల్లి నారాయణ, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో తుమ్మ ఇషాన్ ప్రతిభ




**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరానికి చెందిన తుమ్మ ఇషాన్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్చరీ పోటీల్లో ఈ ఘనత సాధించాడు. కరీంనగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మ ప్రవీణ్ కుమార్ తనయుడైన ఇషాన్, అండర్-13 కాంపౌండ్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. తన గురి తప్పని నైపుణ్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఇషాన్, ఈ నెల 8న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, కోచ్ అభిషేక్ అతడిని అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇషాన్ విజయం పట్ల కరీంనగర్ ఆర్చరీ క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై గ్రామసభ



ఎలిగేడులో సర్పంచ్ కప్పల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న గ్రామసభ.

**ఎలిగేడు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్య పనుల నిర్వహణ, స్ట్రీట్‌లైట్లు, మంచినీటి పైపుల మరమ్మతులు, చేతిప్పుల రిపేర్లు వంటి అంశాలపై పలు తీర్మాణాలు చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్ హాజరై పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, బాపయ్య, రజిత, వాణి, వెంకటేష్ గౌడ్, రమాదేవి, తిరుపతి యాదవ్, రాథ గంగా జమున, శైలజ, లత, కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భూమి పూజ



**గన్నేరువరం, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్నేరువరం మండలం చొక్కారావుపల్లె గ్రామంలో నూతన లక్ష్మీ నరసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నాగసాయి శర్మ వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ అరుకొంతం గోపాల్‌రెడ్డి హాజరై భూమి పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, అనంతరెడ్డి, నంది రెడ్డి, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, సాగర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో ప్రజా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక




**ఆమనగల్లు, మార్చి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్లు లో శుక్రవారం తెలంగాణా రాష్ట్ర పుభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజులో భాగంగా కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాలలో ఈ సందర్భంగా ప్రొఫెసర్ శర్వాణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం వివరాలను వివరిస్తూ విద్యార్థులు ప్రతి ఒక్కరు కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులైన జగదీశ్వర్ రెడ్డి, గోపాల్, రాజు, రాజు, నవనీత, శ్రీవాణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితుల సంక్షేమమే అజెండాగా టీపీసీసీ ఎస్సీ సెల్ సమావేశం

**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షులు రాజేంద్రపాల్ గౌతమ్, జాతీయ సమన్వయకర్త శుక్లా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. సత్యనారాయణ మాట్లాడుతూ, దళితులను సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నెల 12న గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, దళిత సంఘాల నాయకులు హాజరుకానున్నారని, రాష్ట్రంలోని దళితులు, కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ పాల్గొని



విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ మాట్లాడుతూ, దళితులకు విద్య అత్యంత కీలకమని, కానీ గత పన్నెండు సంవత్సరాల బీజేపీ పాలనలో విద్యకు తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. స్కాలర్షిప్‌లు ఇవ్వకపోవడం, ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడం వల్ల దళిత పిల్లలు విద్యకు దూరమై కూలీ పనులు చేయాల్సి వస్తోందని అన్నారు. బీజేపీ రాజకీయపరంగానే కాకుండా ఆధ్యాత్మికంగా కూడా పెత్తనం సాగిస్తూ దళితులు, ఆదివాసులు, బడుగు బలహీన వర్గాలకు స్వాతంత్ర్యం లేకుండా చేస్తోందని ఆరోపించారు. రాబోయే కాలంలో దీన్ని ఎదుర్కోకపోతే దళితుల మనుగడ కష్టమవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అచ్చుత రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, ఉస్మానియా జాక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజా పాలన

-ప్రగతి ప్రణాళిక సమీక్షా సమావేశం



**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రులు సూచించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్‌కి నో, విద్య, యువత--క్రీడలు, మహిళల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొని, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

# నగరంలో ఆక్రమణలపై డిప్యూటీ మేయర్ స్పష్టీకరణ



**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భగత్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించి కార్యాలయం నిర్మించారని వచ్చిన ఆరోపణలపై డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు (మాజీ మేయర్) స్పందించారు. ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ నగరంలో గాని, ఎక్కడైనా గాని అక్రమ నిర్మాణాలు లేదా కబ్జాలకు పాల్పడిన చరిత్ర తమకు లేదని స్పష్టం చేశారు. తాము చేసే ప్రతి పని చట్టబద్ధంగానే ఉంటుందని, అందువల్లే ప్రజల ఆదరణ లభిస్తోందని తెలిపారు. సునీల్‌రావు వివరించారు, 1997లో ఎడవల్లి జగ్గారెడ్డి అనే న్యాయవాది స్థలాన్ని జిడిగ భూమయ్యకు విక్రయించారని, 2004లో భూమయ్య వద్ద నుండి తాను చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నానని చెప్పారు. ఆ స్థలంలోనే 15 ఫీట్ల రోడ్డు వదిలి, 2014లో కార్యాలయం నిర్మించారని, రోడ్డు ఆక్రమణ జరగలేదని స్పష్టం చేశారు. మున్సిపల్‌కు పన్నులు చెల్లిస్తూ, చట్టబద్ధంగా ఉన్న స్థలంలోనే నిర్మాణం చేశామని, ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. మా వద్ద అన్ని చట్టపరమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఎవరి మీద ఆరోపణలు చేయాలన్నా ముందుగా పూర్వాపరాలు తెలుసుకోవాలి. రోడ్లను ఆక్రమించి నిర్మాణం చేసే స్థాయి, వ్యక్తిత్వం మాకు లేదు అని డిప్యూటీ మేయర్ హెచ్చరించారు.

# నిరుపేదల సొంతింటి కలలను నిజం చేస్తాం

-- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు పెద్ధి సత్తవ్వ--మల్లేశం దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం తమ సంకల్పమని తెలిపారు. గత రెండేళ్లలో చొప్పదండి నియోజకవర్గంలో 3500 ఇండ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నామని, నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్క ఇల్లు కూడా కట్టలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# వాసవి వనిత వాగ్దేవి క్లబ్ సమక్షంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జై వాసవి జై జై వాసవి నినాదాలతో వాసవి వనిత వాగ్దేవి క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారికి జ్యోతి ప్రజ్వలన చేసి, శాస్త్రీయ నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వంటల పోటీలు, ఫ్యాషన్ షో, ట్రెడిషనల్ డ్రెస్ పోటీలు, వివిధ ఆటలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలు లక్ష్మి, పార్వతి, సరస్వతి వేషధారణలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు సన్మానం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, మహిళలు ఆనందంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఐఇసి అధికారి జంధ్యం మాధవి, ఐపిసి అధికారి పబ్బ అరుణ, డిస్ట్రిక్ట్ సెక్రటరీ ప్రదీప్, రీజియన్ చైర్ పర్సన్ సూర గీత, కోఆర్సి రాచమల్ల గాయత్రి, రీజియన్ సెక్రటరీ మాడిశెట్టి ఉమాదేవి, క్యాబినెట్ సెక్రటరీ చందా విజయ, హెల్త్ క్యాంప్ ఇంచార్జ్ డాక్టర్ సౌమ్య, జోనల్ చైర్ పర్సన్ యాంసాని భారతి, క్లబ్ అధ్యక్షులు గంప హరిణి, ప్రధాన కార్యదర్శి కేశెట్టి విశాల, కోశాధికారి ముస్త్యాల సమత మరియు సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని డిమాండ్

**అచ్చంపేట, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం గుంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం సైదులు, పేద ప్రజల పొట్ట కోసేలా ఉపాధి హామీ పథకాన్ని దూరం చేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకాల పేర్లు మార్చడం కాదు, పేద ప్రజల బ్రతుకులు మార్చాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు మూడు నెలల బిల్లులు తక్షణమే చెల్లించి వారిని ఆదుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం లేకుంటే గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి భరోసా ఉన్నప్పటికీ, కొత్త పథకాలలో భద్రత లేదని విమర్శించారు. సైదులు మాట్లాడుతూ, అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు గ్రామాల్లో వలసలు నివారించేందుకు పోరాడి వందరోజుల ఉపాధి పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నేటి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పథకాలకు తూట్లు పొడవడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రతి సంవత్సరం కనీసం రూ.2.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు త్రాగునీరు, టెంట్, పనిముట్లు, అత్యవసర మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు, ఉపాధి కూలీలు శ్రీకాంత్, రాజు, మోహన్, దేవి, పార్వతి, ఉపాధ్యాయ రాజు, దేవులీ వెంకట్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్టేడియంలో సంసద్ క్రీడ మహోత్సవం



**కరీంనగర్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో సంసద్ క్రీడ మహోత్సవం ఫైనల్ టోర్నమెంట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, మానకొండూర్--హుజురాబాద్ నియోజకవర్గ ప్రముఖులు కనుమల్ల గణపతి, చెన్నమాధవిని నరసింహారాజు, గుర్రాల వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, నరెడ్ల చైతన్య రెడ్డి, చుక్కల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**గంగాధర, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొరుటపల్లి గ్రామంలో వేడుకలు ఘనంగా జరిగాయి. డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ -- బెటర్ కాటన్ ఇనిషియేటివ్ (బీసీఐ) మరియు నవక్రాంతి ఫపీసీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల సాధికారత, లింగ సమానత్వం, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మహిళలు వ్యవసాయంలో, కుటుంబ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొరుటపల్లి సర్పంచ్ మేకల మహేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై, మహిళలు విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలలో ముందుకు రావాలని, తమ హక్కులను తెలుసుకుని ఆత్మవిశ్వాసంతో ఎదగాలని సూచించారు. డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ మేనేజర్ నికిత, ఏపీ యు యం మాధవి, ఫీల్డ్ ఫెసిలిటేటర్ వనిత మరియు ఇతర ఫెసిలిటేటర్లు పాల్గొని మహిళలకు అవగాహన కల్పించారు. ఉత్సాహభరిత వాతావరణంలో గ్రామ మహిళలు ఆనందంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.